సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



క్రానిక్ అల్సర్ల చికిత్సకు ప్రత్యేక ఓపీ


కాకినాడ క్రైం: క్రానిక్ అల్సర్ల చికిత్సకు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓపీ విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీ ఆర్ విఠల్ శనివారం ప్రారంభించారు.

వెండి చీర సమర్పణ



మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ తల్లికి యెరుబండి నాగేశ్వరరావు, సంతోషిమహాలక్ష్మి దంపతులు శనివారం రూ.1.42 లక్షల వెండి చీర సమర్పించారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నిండు మనసుతో నిను కొలిచేము స్వామీ



బాలాజీస్వామి సన్నిధిలో నిత్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: భక్తిపారవశ్యం వెల్లివిరిసింది.. అప్పనపల్లి క్షేత్రం భక్తులతో పోటెత్తింది.. మాఘ పౌర్ణమి శనివారం కావడంతో శ్రీబాల బాలాజీ స్వామిని కొలిచేందుకు వేలాదిగా తరలివచ్చారు. ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. తమ కోర్కెలు నెరవేరాలని స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మీనారాయణ హోమం వైభవంగా జరిపారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2.94 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.2.38 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.56,141 విరాళాలుగా సమర్పించారు. 4,961 మంది స్వామిని దర్శించుకోగా, 3,285 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు పర్యవేక్షించారు.

వాడపల్లి క్షేత్రానికి రూ.33.88 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: వాడపల్లిలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం రూ.33.88 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ బి.కిశోర్‌కుమార్ తెలిపారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాదాల విరాళం, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయాలు, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా పైమొత్తం సమకూరిందన్నారు.

నారసింహుని సన్నిధిలో జస్టిస్ హరినాథ్



జస్టిస్ హరినాథ్‌కు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహుని ఆలయంలో శనివారం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయం వద్ద జస్టిస్ హరినాథ్‌కు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

సీవాట్లు

- అభ్యర్థుల ప్రకటనతో టీడీపీలో చిచ్చు
- పి.గన్నవరం అభ్యర్థిగా మహాసేన రాజేష్
- ఒప్పుకొనేది లేదంటున్న పార్టీ క్యాడర్
- పార్టీ మండల అధ్యక్ష పదవికి సత్తిబాబు రాజీనామా
- పి.గన్నవరంలో పార్టీ కార్యాలయం మూసివేత
- జనసేనలోనూ ఆగ్రహ జ్వాలలు

సాక్షి, అమలాపురం: టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది.. పార్టీ శ్రేణుల నుంచి చివాట్లు ఎదుర్కొంటోంది.. మంచి ముహూర్తం చూసి అసెంబ్లీ సీట్లు ప్రకటించినా ప్రతిపక్షంలో చీలిక మొదలైంది. ఆదిలోనే హంసపాదు అన్నట్లు జిల్లాలోని పి.గన్నవరం (ఎస్సీ) నియోజకవర్గంలో చిచ్చు రాజుకుంది. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనలో భాగంగా పి.గన్నవరం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్‌కుమార్ (మహాసేన రాజేష్)ను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ అధినేత చంద్రబాబు శనివారం విజయవాడలో ప్రకటించారు. ఈ నిర్ణయం నియోజకవర్గ క్యాడర్‌లో అగ్గి రాజేసింది. స్థానికేతరుడు, వివాదాస్పద వ్యక్తిగా ముద్రపడిన రాజేష్‌ను ఇక్కడి నుంచి పోటీకి పెట్టడాన్ని ఆ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. రాజేష్ అభ్యర్థిత్వాన్ని నిరసిస్తూ టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు పలువురు అదే బాట పట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సత్యనారాయణ మూర్తికి పార్టీ సీనియర్ నాయకుడు డొక్క నాథ్ బాబు, ఇతర పెద్దలు నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. మరోవైపు నియోజకవర్గ కేంద్రం పి.గన్నవరంలోని టీడీపీ కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు తాళాలు వేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ఆందోళన చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు చివరికి కార్యాలయాన్ని తెరిపించారు.

టిక్కెట్ ఆశించి.. భంగపాటుకు గురై

పి.గన్నవరం నియోజకవర్గంలో టీడీపీకి గత ఎన్నికల తరువాత నుంచి ఇన్‌చార్జి లేరు. జిల్లాలో ముమ్మిడివరానికి చెందిన మోకా ఆనంద్‌సాగర్ వంటి నాయకులు వచ్చినా స్థానికేతరులను అంగీకరించేది లేదని క్యాడర్ నిరాకరించింది. టిక్కెట్ ఆశతో మందపాటి కిరణ్‌కుమార్, చిన్నం బాల విజయరావు వంటి వారు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. స్థానికంగా పలువురు నాయకులు టిక్కెట్ ఆశించి పార్టీ జెండా మోస్తున్నా వారందరినీ కాదని కాకినాడ జిల్లాకు చెందిన రాజేష్‌ను ఎంపిక చేశారు. ఆయనను టీడీపీ ఎంపిక చేయడం మిత్రపక్షమైన జనసేనలో సైతం అసంతృప్తిని మిగిల్చింది. నిన్నటి వరకూ ఇక్కడ టీడీపీకి ఇన్‌చార్జి లేకపోవడంతో టిక్కెట్‌పై ఆశతో జనసేన ఇన్‌చార్జి గిడ్డి సత్యనారాయణ పార్టీ కోసం రూ.లక్షలు ఖర్చు పెట్టారు. ఆయనకు అవకాశం రాకపోవడంతో జనసేన క్యాడర్ కూడా మండిపడుతుంది. రాజేష్ వల్ల నష్టపోతామనే విషయాన్ని తమ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళతామని జనసేన నాయకులు చెబుతున్నారు.



పి.గన్నవరంలో మూతబడిన టీడీపీ కార్యాలయం



పి.గన్నవరంలో టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్‌ను చుట్టుముట్టిన జనసేన నాయకులు

అతనైతే కష్టం..

మహాసేన రాజేష్‌ను అభ్యర్థిగా ఎలా నిర్ణయించారని, గతంలో అతను పవన్‌కళ్యాణ్‌ను దుర్భాషలాడారని.. అతనైతే కలసి పనిచేయలేమంటూ టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్‌తో జనసేన నాయకులు వాగ్వాదానికి దిగారు. రాజేష్‌ను అభ్యర్థిగా ప్రకటించడం, వెంటనే టీడీపీ పి.గన్నవరం మండల పార్టీ అధ్యక్షుడు రాజీనామా, పార్టీ కార్యాలయానికి తాళం వేయడం వంటి పరిణామాల నేపథ్యంలో హరీష్ సాయంత్రం పి.గన్నవరం చేరుకుని పార్టీ కార్యాలయాన్ని తెరిపించారు. అందుబాటులో ఉన్న నాయకులతో చర్చించారు. వారు కూడా అభ్యర్థి ఎంపికపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే పార్టీ అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉండాలని హరీష్ కోరారు. తిరిగి వెళుతున్న సమయంలో హరీష్‌ను జనసేన నాయకులు చుట్టిముట్టి తమ నిరసన తెలిపారు. అతనికి సహకరించేది లేదన్నారు. తక్షణం అభ్యర్థిని మార్చాలని కోరారు. పొత్తు ధర్మం పాటిస్తామని, కానీ రాజేష్ అభ్యర్థి అయితే ప్రచారానికి వచ్చేది లేదన్నారు. హరీష్‌తో మండల పార్టీల అధ్యక్షులు, జిల్లా పార్టీ నాయకులు వాదనకు దిగారు.

''మనం నమ్మాం.. ఆయన నమ్మలేదు''

కొత్తపేట నియోజకవర్గాన్ని టీడీపీకి కేటాయించడంపై ఆ నియోజకవర్గ జనసేన నాయకులూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక్కడ నుంచి తమకు అవకాశం వస్తోందని భావించిన ఆ పార్టీ నాయకులకు పొత్తులలో టీడీపీకి కేటాయించడాన్ని వారు తప్పుపడుతున్నారు. టీడీపీ టిక్కెట్ దక్కించుకున్న బండారు సత్యానందరావు సోదరుడు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు నిర్వేదంలో ఉన్నారు. 'మనం ఆయనను నమ్మాం... కానీ ఆయన మనల్ని నమ్మలేదు' అని పార్టీ అధినేత పవన్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. 'నన్ను నమ్మి వచ్చినందుకు క్షమించండి' అని తనను కలసిన కార్యకర్తలను బండారు శ్రీనివాసరావు అభ్యర్థించారు.

'మాదిగలను మోసం చేసిన చంద్రబాబు'

అమలాపురం రూరల్: టీడీపీ వెంటే ఉన్న మాదిగలకు పి.గన్నవరం అసెంబ్లీ సీటు ఇస్తారని ఆశిస్తే, స్థానికేతరుడైన మహాసేన రాజేష్‌కు టిక్కెట్ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నడిపూడి జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా దండోరా నాయకుల సమావేశం జరిగింది. మోకాటి మాట్లాడుతూ గతంలో రెండు సార్లు మాదిగలకు అసెంబ్లీ సీటు ఇస్తానని మోసం చేసిన చంద్రబాబు, ఈసారీ అదే పని చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని మాదిగలకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలో జిల్లా మాదిగలంతా సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నాయకులు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, చేట్ల సత్యనారాయణ, మందా వెంకటేశ్వరరావు, ఉందుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షకు సర్వ సన్నద్ధం

- నేడు జిల్లాలో 33 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరు కానున్న 10,788 మంది అభ్యర్థులు



రాయవరంలోని పరీక్ష కేంద్రం వద్ద బెంచీలపై హాల్ టిక్కెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

రాయవరం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూపు-2 పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 33 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగనుంది. మొత్తం 10,788 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు 475 మంది ఇన్విజిలేటర్లను, ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. అలాగే ఒక లైజనింగ్ అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతోంది. అభ్యర్థులను కేంద్రాల్లోకి ఉదయం 9.30 గంటల నుంచి అనుమతిస్తారు. 10.15 గంటల తర్వాత ఎవ్వరినీ అనుమతించరు. అభ్యర్థులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో బెంచీల ఏర్పాట్లతో పాటు తాగు నీరు, విద్యుత్తు వెలుగులు ఉండేలా చూస్తున్నారు. అభ్యర్థులకు వైద్య సహాయం నిమిత్తం వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు.

అమలాపురం టౌన్: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్-2 పరీక్ష నిమిత్తం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ వెల్లడించారు. మొత్తం 33 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌తో పాటు ఆయా కేంద్రాల పరిసరాల్లో పోలీసు వలయంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష జరుగుతుందని, బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులను కూడా నియమించామన్నారు. ఆయా కేంద్రాల పరిసరాల్లో ఉన్న ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులను కచ్చితంగా పరీక్ష సమయంలో మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారంగా తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఎస్పీ హెచ్చరించారు.

సుభాష్‌కు సీటిస్తే రాజీనామాకు సిద్ధం



వేగాయమ్మపేటలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం టీడీపీ అసెంబ్లీ టిక్కెట్‌ను వాసంశెట్టి సుభాష్‌కు ఇస్తే తామంతా పార్టీకి రాజీనామా చేస్తామని ఆ పార్టీ నాయకులు అల్టిమేటం జారీ చేశారు. శనివారం మండలంలోని వేగాయమ్మపేటలో కమ్మ సామాజిక భవనంలో టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. పది రోజుల కిందట పార్టీలో చేరిన వ్యక్తికి టిక్కెట్ ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. మూడేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, రాయపురెడ్డి రాజా, రేవు శ్రీనుల్లో ఎవరికి సీటు కేటాయించినా పార్టీ కోసం పనిచేస్తామని.. సుభాష్‌కు ఇస్తే మాత్రం రాజీనామా చేస్తామని ప్రకటించారు. సమావేశంలో టీడీపీ నాయకులు చెట్లర్ కర్ణ, కోనాల వెంకటలక్ష్మి, కత్తుల వెంకటేశ్, కె.అనంతలక్ష్మి, వనుం గోవిందరాజు, బొమ్ము బాలకృష్ణ, గారపాటి జోగారావు, కొమరిన బాబీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనసేన మండల కన్వీనర్‌పై అట్రాసిటీ కేసు

అయినవిల్లి: మండల జనసేన కన్వీనర్ పోలిశెట్టి రాజేష్‌పై శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు అయినవిల్లి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం ప్రకారం.. అయినవిల్లికి చెందిన పోలిశెట్టి రాజేష్ జనసేన పార్టీ మండల కన్వీనర్‌గా, తొత్తరమూడి వాసి మద్దాల చంటిబాబు అదే పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. పార్టీ పదవి తీసుకున్న దగ్గర నుంచి రాజేష్ తనపై కుల వివక్ష చూపుతున్నట్లు మద్దా చంటిబాబు అంటున్నారు. 3న ఫోన్ చేసి ఎవరికీ చెప్పకుండా పార్టీ సమావేశం ఎందుకు ఏర్పాటు చేశావంటూ రాజేష్ ప్రశ్నించడన్నారు. అంతేకాకుండా కులం పేరుతో దూషించి, తన నివాసం వద్దకు వచ్చి ఇనుప రాడ్లతో రాజేష్ దాడికి యత్నించాడన్నారు. చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడన్నారు. ఈ మేరకు చంటిబాబు ఫిర్యాదుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఫోన్ మాట్లాడవద్దని అన్నందుకు..

తాళ్లపూడి: ఫోన్ మాట్లాడుతుందని కుటుంబ సభ్యులు మందలించడంతో ఓ విద్యార్థిని ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని మలకపల్లిలో చోటుచేసుకుంది. దీనిపై ఎస్సై శ్యామ్‌సుందర్ కథనం ప్రకారం.. మలకపల్లికి చెందిన ఇమ్మన్ని దేవీమానిక పదో తరగతి చదువుతోంది. ఎక్కువగా ఫోన్ మాట్లాడుతుండటంతో ఆమెను కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో కోపగించి 17న ఇంటి నుంచి వెళ్లిపోయిందని, నేటికీ ఆచూకీ తెలియరాలేదని ఆమె తల్లి ఎల్లారీశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పుణ్యస్నానం.. కమనీయ ఘట్టం


అంతర్వేదిలో సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు


చక్రస్నానం చేయించేందుకు స్వామిని తోడ్కొని వస్తున్న అర్చకులు

- అంతర్వేది, ద్రాక్షారామ క్షేత్రాల్లో స్వామివార్లకు చక్రస్నానాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

సఖినేటిపల్లి: భక్తిభావం ఉప్పొంగింది.. ఆ స్వామివార్లను ప్రత్యక్షంగా తిలకించిన ప్రతీ మది పులకించింది.. అంతర్వేది, ద్రాక్షారామ క్షేత్రాల్లో స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా చక్రస్నానాల ఘట్టం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటింది. అంతర్వేది లక్ష్మీనారసింహుని కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి చక్రస్నానం కన్నుల పండువగా జరిగింది. సుదర్శన చక్రం ధరించిన నృసింహస్వామి (సుదర్శన పెరుమాళ్ స్వామి) జలకమాడిన సముద్రంలోనే అశేష భక్తజనం పుణ్యస్నానం ఆచరించి పులకించింది. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో పేరూరు ఉద్దండ పండితుడు స్వామివారిని ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకువచ్చి సముద్ర స్నానం చేయించారు. అలాగే సముద్ర తీరంలో నాలుగేళ్లుగా నిలిచిన జల్లు స్నానం ఈ ఏడాది ఆలయ అధికారులు పునరుద్ధరించారు. ఉదయం 8 గంటలకు ఆలయం వద్ద ఉత్సవమూర్తులను గరుడ పుష్పక వాహనంపై, పల్లకిలో సుదర్శన చక్రధారుడైన నృసింహస్వామిని ఊరేగిస్తూ మంగళ వాయిద్యాలతో తీరానికి తోడ్కొని వచ్చారు. అక్కడ దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో నారసింహస్వామికి పంచామృతాలు, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు చేశారు. పేరూరు పండితులు సుదర్శన చక్రధారుడైన స్వామిని శిరస్సుపై ధరించి సముద్ర స్నానం చేయించారు. స్వామితో పాటు భక్తులు, అధికారులు, ప్రముఖులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామిని అర్చకులు ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకెళ్లారు. దద్ధోజనం, పానకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పిదప స్వామిని గరుడపుష్పక వాహనంపై ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై రాము, ఎంపీపీ వీరా మల్లిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఆలయం వెలుపల, ధర్మదర్శనం, శ్రీఘ్రదర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గంట గంటకూ పెరిగింది. సాయంత్రం వరకూ క్యూలైన్లలో ఉండి భక్తులు శ్రీస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

అంతర్వేదిలో నేడు

అంతర్వేది ఉత్సవాల్లో పదో రోజు ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక చెరువులో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు ఉత్సవరులకు తిరుమంజనం, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్ఠి, స్వామివారి పవళింపు సేవ ఉంటుంది.

వైభవం.. వసంతోత్సవం


భీమేశ్వరాలయ సప్త గోదావరిలో త్రిశూల స్నానం, చక్రస్నానం ఆచరిస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఆలయంలో వసంతోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం నుంచి కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండీకా సమేత సూరేశ్వరస్వామివార్లను రథంపై దేవాలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో వేద పండితులు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాల మధ్య తీర్థపు బిందె, బాలభోగం, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, నాకబలి, గ్రామోత్సవాలు చేశాక త్రిశూల స్నానం, చక్రస్నానం జరిగాయి.

నేడు తెప్పోత్సవం : స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చన, తీర్థపు బిందె, బాలభోగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం భక్తులచే విశేష అభిషేకాలు, మాణిక్యాంబా అమ్మవారికి వివిధ రకాల పుష్పార్చనలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్న కాలార్చన, రాజభోగ నివేదన సేవ అనంతరం రాత్రి 7.05 గంటలకు సప్త గోదావరి నదిలో శ్రీస్వామివార్లు, అమ్మవార్ల తెప్పోత్సవం కన్నుల పండువగా జరుగనుంది.

టీడీపీకి పి.గన్నవరం మండల అధ్యక్షుడి గుడ్ బై

ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజేష్‌ను ప్రకటించడమే కారణం


మండల టీడీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న తోలేటి సత్తిబాబు

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్‌ను ప్రకటించడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోలేటి సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మండల శాఖ అధ్యక్ష, క్లస్టర్-5 ఇన్‌చార్జి పదవులకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన పత్రాన్ని పార్టీ అధిష్టానానికి పంపుతున్నట్టు వివరించారు.

మూతబడిన పార్టీ కార్యాలయం

అసెంబ్లీ టీడీపీ టిక్కెట్‌ను సరిపెల్ల రాజేష్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ శనివారం పి.గన్నవరంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని మూసివేశారు. ఒక్క నాయకుడూ అక్కడకు రాలేదు. ఆ పార్టీ నాయకుడు గంటి హరీష్ మాధుర్ సాయంత్రం 5 గంటలకు రావడంతో తిరిగి పార్టీ కార్యాలయాన్ని తెరిచారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజేష్ అభ్యర్థిత్వాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. దీంతో కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని హరీష్‌మాధుర్ ప్రకటించారు.

సీఎమ్ఆర్‌లో సరికొత్త బంగారు ఆభరణాలు

రాజమహేంద్రవరంలో జ్యూయలరీ షోరూమ్ ప్రారంభం


షోరూం ప్రారంభోత్సవంలో శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అందరూ మెచ్చే ఆధునిక డిజైన్ల బంగారు ఆభరణాల మేళవింపుగా సీఎమ్ఆర్ జ్యూయలర్స్ మొదటి స్థానంలో నిలుస్తుందని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, ప్రముఖ బిల్డర్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం రాజమహేంద్రవరం కోటగుమ్మం కందకం రోడ్‌లో ఏర్పాటు చేసిన సీఎమ్ఆర్ జ్యూయలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించి మొదటి కొనుగోలు చేశారు. సీఎమ్ఆర్ గ్రూప్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అతి పెద్దదైన బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ షోరూమ్‌లో నేటితరానికి అనుగుణంగా నూతన డిజైన్లు, సరికొత్త కలెక్షన్లతో జ్యూయలరీ అందుబాటులో ఉందన్నారు. షోరూం ప్రారంభోత్సవ ఆఫర్‌గా గ్రాము బంగారం కొనుగోలుపై రూ.250 వరకూ క్యాష్ బ్యాక్ ఇస్తున్నట్టు ప్రకటించారు. కంటిపూడి స్టీల్స్ మేనేజింగ్ పార్టనర్ కంటిపూడి సర్వారాయుడు పాల్గొని షోరూమ్ మొదటి అంతస్తును, క్లాస్-1 కాంట్రాక్టర్ ఆర్.సుబ్బరాజు రెండో అంతస్తును, కాంట్రాక్టర్ బిల్డర్ డీబీవీ రాజు డిజైన్ రూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ చైర్మన్ చందన నాగేశ్వర్, వ్యాపారవేత్తలు చెరుకూరి వీర్రాజు, అక్కిన ముని కోటేశ్వరరావు, చెరుకూరి కృష్ణాజీ, ఆదర్శ హాస్పిటల్ డాక్టర్ టి.పద్మజ పాల్గొన్నారు.